క్లుప్తంగా

విద్యార్థుల రక్తదానం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

విశాఖ సిటీ: ఏయూ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో వీ ఆర్ విత్ యూ చారిటబుల్ ట్రస్ట్, సేవ్‌యో సంస్థల సహకారంతో శనివారం ఐపీసీ గ్యాలరీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గిరిజాశంకర్, బీవోఎస్ చైర్మన్, ఏయూ అకడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ ఈశ్వర్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.శైలజ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 70 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. వారిని ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ హరినాథ్ అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు తరుణ్, హర్ష, అభిరామ్, పవన్, మాధురి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

పేద బాలలకు సాయంత్రం ట్యూషన్

మద్దిలపాలెం: మురికివాడల్లోని బడి ఈడు పిల్లల కోసం సాయంత్రం ట్యూషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చదువు మధ్యలో ఆపేసిన పేద బాలలకు విద్యను అందించే ఉద్దేశంతో ఉచిత ట్యూషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. బీచ్ రోడ్డులోని ఫిషింగ్ హార్బర్ వద్ద గల సఫనెట్ హాస్టల్ పక్కన ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. సోమవారం నుంచి క్లాసులు ప్రారంభమవుతాయని ఆయన చెప్పారు.

లోగో ఆవిష్కరణ


కేటీబీ హెల్పింగ్ హ్యాండ్స్ లోగోను ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఆరిలోవ: స్వచ్ఛంద సంస్థ కేటీబీ హెల్పింగ్ హ్యాండ్స్ లోగో ఆవిష్కరణ కార్యక్రమం శనివారం విశాలాక్షినగర్‌లో జరిగింది. ముఖ్య అతిథి కేటీబీ ఐకాసీ కన్వీనర్ దాసరి రాము విశాఖ సభ్యులతో కలిసి లోగో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు విద్య, వైద్య సహకారం అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులను అభినందించారు. నిరుపేదల కోసం గౌరవ అధ్యక్షుడు జి.వెంకటసుబ్బారావు ఆర్థిక సాయం అందించారు. కేటీబీ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రధాన కార్యదర్శి సలాది భవాని, ఉపాధ్యక్షుడు మట్రివేముల శ్రీనివాస్, కోశాధికారి బలగ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం స్వామివారికి మహాపూర్ణాహుతి అందించారు. ద్వాదశ ఆరాధనలు, పవిత్ర విసర్జన, రుత్విక్ సన్మాన కార్యక్రమాలు జరిగాయి. శనివారంతో ఈ వేడుకలు ముగిసినట్లు ఆలయ కమిటీ కార్యదర్శి ప్రసాదరావు వెల్లడించారు. స్వామి వారు ధరించిన పవిత్రాలను భక్తులకు అందజేశామన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల 'స్వచ్ఛ భారత్'


శుభ్రం చేస్తున్న వలంటీర్లు, అధికారులు

తాటిచెట్లపాలెం: స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా స్వచ్ఛతా యాక్షన్ ప్లాన్ 2024, మాసివ్ క్లీనింగ్‌కు ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని శనివారం ఏయూ రెక్టార్ ఎన్.కిషోర్‌బాబు ప్రారంభించారు. సుమారు 10 కళాశాలల నుంచి 200 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొని ఎంవీపీ రైతుబజార్ పరిసరాలను శుభ్రపరిచారు. చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. స్వచ్ఛ భారత్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ రీజనల్ యూత్ ఆఫీసర్ ఆర్.సాయిద, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరనాథ్, ఎన్‌ఎస్‌ఎస్ ట్రైనింగ్ కో ఆర్డినేటర్ పి.రామచంద్రరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు, జీవీఎంసీ, హెల్త్ ఆఫీసర్, రైతుబజార్ అధికారులు పాల్గొన్నారు.

కిలకిలలు

- జూ పార్కులో అలరిస్తున్న పక్షులు
- సెల్ఫీలు దిగుతూ సందర్శకుల సందడి


లవ్ బర్డ్స్ జోన్‌లో రామచిలుకలు


జూ అద్దాల ఎన్‌క్లోజర్‌లో ఆఫ్రికన్ పక్షులు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులోని చిలుకలు కిలకిలారావాలతో సందర్శకులను అలరిస్తున్నాయి. ఇటీవల జూలో పక్షుల కోసం అద్దాల ఎన్‌క్లోజర్లు నిర్మించారు. వాటిలో ఆఫ్రికన్ చిలుకల జోన్ పనులు పూర్తయ్యాయి. లవ్ బర్డ్స్ జోన్‌లో పనులు జరుగుతున్నాయి. ఆఫ్రికన్ పక్షుల జోన్‌లో చిలుకలు అద్దాల ఎన్‌క్లోజర్లలో ఏర్పాటు చేసిన కర్రలపై నిల్చుని సందర్శకులను పలకరిస్తున్నాయి. అవి వివిధ రకాల అరుపులతో జూకు వస్తున్న పిల్లలను ఆకట్టుకుంటున్నాయి. ఈ పక్షులు వివిధ రంగులతో పెద్ద సైజులో ఉండటంతో అద్దాల లోపల నుంచి సందర్శకులకు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో వాటిని సందర్శకులు సెల్‌ఫోన్స్‌లో బంధిస్తున్నారు. కొందరు చిలుకల ఎన్‌క్లోజర్ల వద్ద సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు. లవ్ బర్డ్స్ జోన్‌లో కూడా అద్దాల్లో ఉన్న కొన్ని రకాల రామచిలుకలు సందర్శకులను అలరిస్తున్నాయి. గతంలో వీటి గూళ్లు ఇనుప మెస్‌తో ఉండేవి. వాటి నుంచి చిలుకల అరుపులు వినిపించడం తప్పా అవి పూర్తిగా కనిపించేవి కాదు. ఇప్పుడు అద్దాలు అమర్చడంతో వాటిలో పక్షులు సందర్శకులకు స్పష్టంగా కనిపించడంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


ఆఫ్రికన్ పక్షుల జోన్ వద్ద చిలుకలను తిలకిస్తున్న సందర్శకులు

అత్యుత్తమ వర్సిటీల్లో ఏయూకు స్థానం


మాట్లాడుతున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: విద్యార్థులు సానుకూల దృక్పథం, ఆలోచనలతో ముందుకు సాగాలని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు సూచించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా శనివారం ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి వీసీ కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. నాక్, ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఏయూ మెరుగైన స్థానం సాధించిందని, రానున్న కాలంలో దేశంలోని అత్యుత్తమ 10 విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఏయూను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ నేవల్ ప్రాజెక్ట్స్(విశాఖ) చీఫ్ ఇంజినీర్ బ్రిగేడియర్ సురేష్ రామనాథన్ మాట్లాడుతూ సిక్కిం, కశ్మీర్ లాంటి ప్రాంతాల్లో గతంలో చేసిన నిర్మాణాలు, ప్రస్తుతం చోటు చేసుకుంటున్న మార్పులను వివరించారు. జీఐఎస్, రిమోట్ సెన్సింగ్ రంగాల్లో నిష్ణాతులుగా మారాలని సూచించారు. విభాగాధిపతి ఆచార్య కె.రాంబాబు మాట్లాడుతూ ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం బోధన, పరిశోధన, కన్సల్టెన్సీ రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని తెలిపారు. అత్యాధునిక సదుపాయాలతో ఆరు ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతిభ చూపించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలు అందజేశారు. బీఐఎస్ విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ డి.అఖిల్, విభాగ ఆచార్యులు కె.శ్రీనివాసరావు, సి.ఎస్.వి.సత్యనారాయణ రెడ్డి, సదస్సు కన్వీనర్ ఆచార్య ఐ.శివపార్వతి, స్టూడెంట్ కన్వీనర్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో ప్రథమ చికిత్సపై అవగాహన


ఫస్ట్ ఎయిడ్‌పై అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్. కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు అధ్యక్షతన, యూత్ రెడ్‌క్రాస్, రెడ్ రిబ్బన్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ ప్రథమ చికిత్స దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జిల్లా రెడ్‌క్రాస్ సెక్రటరీ రవికుమార్, ప్రథమ చికిత్స నిపుణుడు డాక్టర్ రహమతుల్లా ప్రథమ చికిత్స విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు, అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటుకు గురైన వారికి చేయాల్సిన సీపీఆర్ విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, రెడ్‌క్రాస్, రెడ్ రిబ్బన్ కో ఆర్డినేటర్లు రామకృష్ణ, సాయికృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, డాక్టర్ శామ్యూల్ డేవిడ్‌రాజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా యుగంధర్


కొత్త పాలకవర్గాన్ని అభినందిస్తున్న సొసైటీ సభ్యులు

ఎంవీపీకాలనీ: ఆంధ్రా యూనివర్సిటీ స్టాఫ్ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా డాక్టర్ ఎన్.ఎం.యుగంధర్ నియమితుడయ్యారు. రొటేషన్‌లో భాగంగా శనివారం సొసైటీ కార్యాలయంలో కార్యవర్గ సభ్యులు తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యుగంధర్ తెలిపారు. అధ్యక్షుడితోపాటు ఇతర పాలకవర్గ నాయకులను ఎన్నుకున్నారన్నారు. సొసైటీ ఉపాధ్యక్షుడిగా డొక్కర శ్రీనివాస్, కార్యదర్శిగా సిహెచ్.లక్ష్మణబాబు, కోశాధికారిగా డాక్టర్ ఎ.పల్లవి, అదనపు కార్యదర్శిగా కిలాన కిరణ్ నియమితులైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా పాలక వర్గ సభ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఆచార్య సుధాకర్, ఆచార్య సిద్ధయ్య, ఖాదర్‌బాబు, గోవింద్, రవి పాల్గొన్నారు.

అన్నసమారాధనల సందడి


సుందర్‌నగర్ కొండపై భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మేయర్ హరివెంకటకుమారి


కొత్త వెంకోజీపాలెంలో మండపం వద్ద లక్ష్మీగణపతి హోమం చేస్తున్న సంఘ ప్రతినిధులు

ఆరిలోవ/మద్దిలపాలెం/బీచ్‌రోడ్డు/ఎంవీపీకాలనీ: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం పలు చోట్ల అన్నసమారాధనల సందడి నెలకొంది. 9, 10, 11, 12, 13 వార్డుల్లోని విశాలాక్షినగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్, బాలాజీనగర్, గాంధీనగర్, చినగదిలి, ఆరిలోవ కాలనీ తదితర ప్రాంతాల్లో అన్నదానాలు జరిగాయి. 10వ వార్డు సుందర్‌నగర్ కొండపై లోకల్ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథి మేయర్ గొలగాని హరివెంకటకుమారి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ముందుగా ఆమె స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, బొండా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- కొత్త వెంకోజీపాలెంలోని పూరి జగన్నాథ స్వామి సెట్టింగ్ గణపతి మండపం వద్ద నిర్వహించిన లక్ష్మీ గణపతి హోమంలో గ్రామ సేవా సంఘం ప్రతినిధులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. మధ్యాహ్నం మండపం వద్ద మహా అన్నదానం జరిగింది. సుమారు 3 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. సంఘ ప్రతినిధులు కాళ్ల శంకర్, బోరా ధనరెడ్డి, కామేశ్వరరావు, మద్దాల వీర వెంకట అప్పారావు, నరసింహరెడ్డి పాల్గొన్నారు.
- 28వ వార్డు సంతోషమాత కాలనీలో భక్తులకు ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు అన్నప్రసాదం వడ్డించారు.


అన్నప్రసాదం వడ్డిస్తున్న నాగరాజు తదితరులు

నరసింగరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

- 17వ వార్డు పెదవాల్తేరులో విక్టరీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు కార్యక్రమాన్ని ప్రారంభించి, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ముందుగా వరసిద్ధ వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సంతోషమాత కాలనీలో అన్నదానం చేస్తున్న పల్లా దుర్గారావు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి


సమాజ సేవకులను సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు గంటా, పంచకర్ల

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంగళగిరిలో ఐదెకరాల స్థలం కేటాయించేలా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ద్వారా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు సామాజిక సేవకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఫణీంద్ర కుమార్, నాయకులు దాసరి రాము, కోల్లా నారాయణరావు, చెన్నకేశవుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 6న వైజాగ్ జూ మారథాన్


వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ కృష్ణచైతన్య

బీచ్‌రోడ్డు: వైజాగ్ ట్రైల్ రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 6న వైజాగ్ జూ మారథాన్ 3వ ఎడిషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు రేస్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణచైతన్య తెలిపారు. విశాఖలోని ఓ హోటల్‌లో శనివారం మారథాన్ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఇందిరా గాంధీ జూ పార్కు నుంచి మారథాన్ ప్రారంభమవుతుందని, 21కే, 10కే, 5కే, 3కే పేరిట పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు, నగర ప్రజలంతా ముందుగా తమ పేర్లను www.vtra.run వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. విజేతలుకు రూ.3 లక్షల నగదు బహుమతి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు యోగేష్, రవి, శ్రీరామ్, యశ్వంత్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక దీపారాధన




మంగాపురంలో పూజలందుకుంటున్న వినాయకుడు, దీపారాధనలో పాల్గొన్న మహిళలు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెం మంగాపురం కాలనీలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బ్లూ డైమండ్ క్రియేషన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అర్చకుడు అవినాష్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాలనీకి చెందిన మురళీకృష్ణ, లలిత దంపతుల ఆర్థిక సాయంతో వినాయక విగ్రహం ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. శనివారం మండపం ఆవరణలో మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో దీపారాధన చేశారు. ఓం, శివలింగం, వేంకటేశ్వరస్వామి ఆకృతులను చిత్రీకరించి చుట్టూ దీపాలు వెలిగించారు. ఆదివారం వినాయకుడి అనుపు ఉత్సవం జరుగుతుందని, భక్తులంతా పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ ప్రతినిధులు జగన్నాథ ప్రసాదరెడ్డి, జి.ఆదినారాయణరెడ్డి, పవన్, సన్నీ, రవి, భాస్కర్, శంకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో హిందీ దినోత్సవం


హిందీ దివస్ వారోత్సవాలను ప్రారంభిస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

తాటిచెట్లపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగంలో శనివారం హిందీ దివస్ ఉత్సవాలను రాజ్యసభ మాజీ సభ్యుడు, హిందీ విభాగం గౌరవ ఆచార్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ప్రారంభించారు. వారం రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఈ నెల 21తో ముగుస్తాయని ప్రొఫెసర్ నల్ల సత్యనారాయణ తెలిపారు. ముగింపు రోజున ఎంఏ సెకండియర్ హిందీ విద్యార్థులకు, స్కాలర్స్‌కు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం


2013–14 బ్యాచ్ విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

విశాఖ–లీగల్: బీచ్ రోడ్డులోని గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌పీటీ పాఠశాలలో శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. 2013–14 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు హాజరై తమ మధురమైన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు కె.పృథ్వీనాయుడు, గండేపల్లి సునీత, సోపేటి దుర్గాప్రసాద్, పిల్ల పవన్, వి.అరవింద్, జ్యోతి, సంధ్య, సూరాడ లక్ష్మి తమ బాల్య సంగతులను గుర్తు చేసుకుంటూ పాఠశాల యాజమాన్యం తమ ప్రగతికి అందించిన సేవలను కొనియాడారు. వివిధ సంస్థల్లో ఉన్నత స్థాయిలో ఉన్న కోలా కుమారి వంటి విద్యార్థులు ఆ రోజుల్లో యాజమాన్యం, ఉపాధ్యాయుల కృషి మరువలేనిదన్నారు. ప్రిన్సిపాల్ మధురవాణి మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతి పాఠశాల ఎదుగుదలకు ఒక ప్రాణవాయువుగా చెప్పారు.